అసలే మానసిక ఒత్తిడిలో వున్న నాకు అప్పుడే వచ్చిన ఇ-మెయిల్ చదివాక వత్తిడి కాస్త ఎక్కువైంది. ఆ ఇ-మెయిల్ సారాంశం 'మా చిన్నాన్న కొడుకు శ్రీరామ్ ఉద్యోగార్థం రేపు నా యింట్లో దిగుతున్నాడు. అదీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం!'.

ఐదేళ్ళ క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం నేను బెంగుళూరు వచ్చినప్పటి పరిస్థితికి ఈ 2009 పరిస్థితికి అసలు పొంతనేలేదు. ఏడాదిన్నర అష్టకష్టాలు పడి చిన్నాచితకా కంపెనీల్లో అనుభవం సంపాదించి చివరికి ఓ పెద్ద ఐటి జైంట్ కంపెనీలో ప్రాజెక్ట్ మేనేజర్ ఉద్యోగం సంపాదించి అందరితో 'లక్కీ ఫెలో'గా ముద్ర వేసుకున్నప్పటి ఆ రోజులు వేరు. ఆర్థిక మాంద్యంతో అన్ని దేశాలూ అల్లకల్లోలమైన ఈ రోజుల్లో ఇంకా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలపై వ్యామోహం కోల్పోని యువత వుండటం నన్ను ఆశ్చర్యపరిచింది.

శ్రీరామ్ ఇక్కడికి వస్తున్న నేపథ్యంలో గత సంవత్సరముగా నా జీవితంలో చోటు చేసుకుంటున్న అనూహ్య సంఘటనలు, అనుభవాలు ఒక్కొక్కటే కళ్లముందు కదిలాయి.

# ఒకే ఒక మార్గం

## సి. రామానాయుడు

సరిగ్గా ఏడాది క్రితం అనుకుంటా - మా కంపెనీ ఉద్యోగులందరికీ యాజమాన్యం తరపున ఓ ఇ-మెయిల్ అందింది. దాని సారాంశం ''రాత్రీ పగలు కష్టపడి టాలెంట్ నిరూపించుకున్న వారిని మాత్రమే కంపెనీ గుర్తిస్తుంది''. అయితే ఈ మెసేజ్‌ని చాలామంది లైటుగా తీసుకున్నారు.

ఎప్పుడూ ఉద్యోగుల్ని వార్మప్ చేసే సందేశం గానే అనుకున్నాం. కాని ఆ రోజు పంపిన ఆ ఇ-మెయిల్ వెనక అప్పుడే పాశ్చాత్యదేశాలలో ఆర్థిక మాంద్యం చాపక్రింద నీరులా ప్రవేశించిందనీ, దాని ఫలితమే ఆ ఇ-మెయిల్ అని మాలో చాలామంది గుర్తించలేకపోయాం. ఆ మాట కొస్తే మన దేశంలోని ఆర్థిక శాస్త్రవేత్తల అంచనాలకి కూడా అందలేదు.

మరో నెల గడవకముందే జరిగిన మరో సంఘటన మాలో మొదటి సారిగా మా ఉద్యోగంపై అసంతృప్తిని రేపింది. ఆ నెల శాలరీ స్లిప్ ఆత్రుతగా ఓపెన్ చేసి చూసుకున్న నాకు చాలా నిరాశ మిగిలింది. సహజంగా ప్రతి ఆరు నెలలకి రావలసిన ఇంట్రిమ్ ఇంక్రిమెంట్ ఈ శాలరీ స్లిప్‌లో మిస్సైంది. ఇది నాకే కాదు చాలామంది ఉద్యోగులకి కూడా జరిగింది. అలాగని ఎవ్వరికీ ఇంక్రిమెంట్ రాకుండా కూడా పోలేదు. కొంతమందికి ఇంక్రిమెంట్ అందడంతో మాలో అసంతృప్తిజ్వాలలు మరింత రగిలాయి. ఆరోజు మళ్లీ మేనేజ్‌మెంట్ నుండి ఇ-మెయిల్ సందేశం అందుకున్న వారిలో నేనూ ఒకడ్ని. దాని సారాంశం ''నిరాశపడి విధులని - నిర్లక్ష్యం చేయకండి... బెస్టాఫ్ లక్ నెక్స్ట్ టైమ్...!'' అయితే ఈ చర్య వెనుక పెద్ద ప్రమాదం పొంచి ఉందని నేనేకాదు మాలో చాలామంది అప్పుడు గ్రహించలేక పోయాం.

ఆరోజు ఎంతో ఆతృతతో నా రాకకోసం ఎదురు చూస్తున్న నా శ్రీమతి శిరీష నన్ను చూస్తూనే ప్రేమతో ''మోహన్! టిఫిన్ రెడీగా ఉంది. ప్రెషప్ అయ్యిరండి...'' అంది శిరీష. రోజూ ఉండే పలకరింపే అయినా ఆ రోజు ఆమె పలకరింపులో స్పెషాలిటీ ఉంది. దానికి కారణం లేకపోలేదు.

భర్త ఇంక్రిమెంట్‌తో ఇంటికొస్తాడని గంపెడాశతో గడపదగ్గరే కళ్లు కాయలు కాసేలా సాయంత్రం నుండి ఎదురుచూస్తోంది. రాబోయే ఇంక్రిమెంట్ని దృష్టిలో వుంచుకొని మూడు నెలల ముందే ఇంటికి కాస్ట్లీ సోఫాసెట్ కొందామని ప్లాన్ చేసుకుంది.

''మోహన్....! నేను రెడీ... బజారుకి వెళ్దామా...?'' కదిపింది శిరీష.

''సారీ... డియర్...! అనుకోని విధంగా ఈసారి ఇంక్రిమెంట్ రాలేదు'' నిరాశగా అన్నాను.

''వాట్...! ఇంక్రిమెంట్ రాలేదా.....?'' దాదాపు షాక్ తిన్నట్టుగా అంది శిరీష.

''యస్... అస్సలు ఎవ్వరికీ రాలేదంటే అదికాదు. కొంతమందికి వచ్చాయి. మేనేజ్‌మెంట్ స్ట్రేటజీ ఎంటో....? అలా ఎందుకు జరిగిందో'' అర్థం కాక ఆలోచిస్తూ అన్నాను.

గత రెండేళ్ళలో అనుకొన్నది కొనలేక పోవడం ఇదే మొదటిసారి. అందుకే శిరీష చాలా అసంతృప్తికి లోనైంది. అది గమనించిన నాకు చాలా బాధేసింది. అయితే ఏం చెయ్యని పరిస్థితి.


మరో రెండ్నెల్లు గడవక ముందే అమెరికా ఆర్థిక మాంద్యంలో కూరుకు పోయిందని ప్రపంచ దేశాలకి మెల్లగా తెలిసే లోపే చాలా దేశాలు ఆ ప్రభావంతో కొట్టుకుపోయాయి. భారతదేశంలో సాఫ్ట్‌వేర్ కంపెనీల బిజినెస్సంతా విదేశాల ఆర్డర్లపైనే ఎక్కువగా ఆధారపడి వుండటంతో చాలా కంపెనీలకి కొత్త ఆర్డర్లు కరువవడమే కాక చేతిలో వున్న ప్రాజెక్టులు కూడా కాన్సిలు అయ్యే పరిస్థితొచ్చింది. అందుకు మా కంపెనీ మినహాయింపు కాదు. కొత్తఆర్డర్లు లేకపోయినా, చేతిలో చాలా ప్రాజెక్టులే వున్నాయన్న ధీమాతో ఆర్థిక మాంద్యానికి మేం తలొగ్గాల్సిన అవసరం రాదనుకున్నాం. కానీ ఆరోజు మా నోటీస్ బోర్డులో అంటించిన సర్క్యులర్ చూసి నాతోపాటూ అందరికి చెమటలు పట్టాయి.

దాని సారాంశం ఏంటంటే-

''ప్రపంచం మొత్తం ముఖ్యంగా అమెరికాతో సహా తమ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులని ఉద్యోగాల నుండి తొలగిస్తూ వస్తున్న వార్తలు మీకు తెలిసిందే. కేవలం ఒక్క అమెరికాలోనే పదివేల ఉద్యోగులు తమ ఉద్యోగాలని మొన్నటికి మొన్న కోల్పోయారు. ఈ నేపథ్యంలో మన కంపెనీ కూడా కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకుంది. కింద పేర్కొన్న ఉద్యోగుల్ని శాశ్వతంగా ఉద్యోగాల నుండి తొలగిస్తున్నాం. అంతేకాక మరికొందరి జీతాలలో గణనీయంగా కోత విధిస్తున్నాం. ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకొని మేనేజ్‌మెంట్‌తో ఉద్యోగులు సహకరిస్తారని ఆశిస్తున్నాం.''

ఈ నోటీసు చదివిన నేను గుండెలు దడదడ కొట్టుకుంటుండగా ఉద్యోగం కోల్పోయిన వారి పేర్లను చదివాను. నిజంగా ఆ లిస్టు చదువుతూ నేను పొందిన నరకయాతన అంతాయింతా కాదు. ఎక్కడ నా పేరు కనబడుతుందోనన్న భయం నన్ను అణువణువునా ఆక్రమించింది. ఆ లిస్టులో నా పేరు లేకపోయేసరికి దేవుడికి మనసులోనే శతకోటి దండాలు పెట్టుకున్నాను. అయితే ఆ ఆనందం నాకు ఎంతో సేపు నిలవలేదు. ఎందుకంటే జీతంలో కోత విధించిన వారి లిస్టులో నా పేరే అగ్రస్థానంలో వుంది. అది కూడా నలభై శాతం కోత విధించేసరికి నాకు కాళ్ళూ చేతులు ఆడలేదు. దాదాపు ఉద్యోగాలు కోల్పోని అందరి పేర్లు జీతం కోత లిస్టులో దర్శనమిచ్చాయి.

ఆ రోజు ఆఫీసులో ఏ ఒక్కరి ముఖంలో కూడా జీవకళ లేదు. అందరూ ముభావంగా ఎవరి పనులను వారు చేసుకున్నారు. ఆ రోజుతో అందరికి ఉద్యోగ అభద్రతా భావం ఎక్కువైంది.



ఒకవైపు జీతం కోత నన్ను రంపపు కోతలా బాధిస్తుంటే, మరో వైపు ఈ విషయాన్ని శిరీషతో ఎలాచెప్పాలో... చెప్పాక ఇంట్లో వాతావరణం ఎలా వుంటుందో... ఊహించడానికే భయమేసింది. మొదటిసారిగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నెందుకయ్యాను భగవంతుడా! అని బాధపడ్డాను.

ఆరోజు ఇంటికి చేరుతూనే శిరీషకి డైరెక్టుగా విషయం చెప్పాను. నేనూహించినట్టు భయానకమైన సీనేది జరగలేదు. ఆశ్చర్యమేసింది. నా శిరీషేనా? అని అనుకున్నాను. ఆమె స్ట్రాటజీ ఏంటో అర్థం కావడము లేదు. తరువాత తెలిసింది, సైలెంట్‌గానే ఎంత వయొలెన్సు సృష్టించొచ్చోనని.

శిరీష నాతో మాట్లాడ్డానికి నెల రోజులపైనే పట్టింది. ఇప్పుడు పబ్బులు లేవు. పబ్బాలు లేవు. వీకెండు సెలబ్రేషన్స్ అసలే లేవు. ఎంతసేపూ ఉద్యోగం ఉంటుందా? ఊడుతుందోననే భయాందోళనలతోనే దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షులా రోజులు గడిచిపోతున్నాయి. ఈ పరిస్థితి నాకే కాదు... ప్రపంచంలో ప్రతి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుని వేధిస్తోందనడంలో సందేహం లేదు.

మొదటిసారిగా నాలో నేను అనుకున్నాను. ''అసలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకి లక్షల్లో జీతాలు ఇమ్మని మేనేజ్‌మెంట్‌ను ఎవరు కోరారు? యాజమాన్యమే మాకు అలవాటుచేసింది. చాలామంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు మామూలు డిగ్రీలు చేసి ఆ తరువాత ఈ ఉద్యోగంపై మోజుతో ఈ కోర్సు ఆ కోర్సుచేసి ఈ ఫీల్డులోకి దిగిన వారే. అన్నిటికన్నా విచారించ దగ్గ విషయం – ఇటు మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లు కూడా వారి దారి వదలి ఐటి కేసి అర్రులు చాచడం ఎంతవరకు సమంజసం? డాక్టర్లకీ, ఐఎఎస్ ఆఫీసర్లకి లేని జీతాలు మాకు ఇవ్వజూపటం కంపెనీల తప్పు కాదా....?'' అందలమెక్కించింది వారే అంధ కూపానికి తోసిందీ వారే.

మొన్నటివరకు బంట్రోతు దగ్గర నుండీ బంధువర్గం వరకు ''నీ కేంటి.. సాఫ్ట్‌వేర్ ఇంజనీరువీ...!'' అన్నవారే ఈ రోజు ''పాపం... సాఫ్ట్‌వేరుద్యోగి!'' అన్నవరకూ పరిస్థితి రావడం నిజంగా భరించలేని శిక్ష.

ప్రతి బ్యాంకు ఎగ్జిక్యూటివ్ నా చుట్టూ, మా ఆఫీసు చుట్టూ తిరిగి ''సారు... కారు లోను తీసుకోండి, హోమ్ లోనూ తీసుకోండి, ఈ మొబైల్ తీసుకొనండి, ఆ కంప్యూటర్ కొనండి'' అంటూ మొన్నటివరకు వేడుకొని ఈరోజు మా ఆఫీసు దరిదాపులకే రావడం మానేశారు. కోరి వెళ్ళిన నన్ను చూసి తప్పించుకొని దూరంగా జరిగిపోయే వారూ లేక పోలేదు. ఇది నన్ను మరింత బాధకి గురిచేసింది.

నా సహోద్యోగులు కొందరు ''ఈ సాఫ్ట్‌వేరు ఉద్యోగం కాకపోతే వేరే ఉద్యోగం....! ఆ మాటకొస్తే నాది మెకానికల్ సైడు... నా కేం డోకాలేదు'' అన్న ధీమాని ప్రదర్శించి వేరే ఉద్యోగాల్లో చేరిన వారం రోజుల్లోనే తిరిగి నిరుద్యోగులైన వైనం నాకు తెలియనది కాదు. ఒక సాఫ్ట్‌వేర్లో చేరి, ఒక రకమైన వర్కింగ్ వాతావరణానికి అలవాటుపడి వారు, మళ్ళీ ఓ మెకానికల్ ఇంజనీరో, సివిల్ ఇంజనీరో లేదా ఆఫీసర్‌గానో పని చేయటం అంత సులభం కాదు. ఇది నాలాంటి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకి నిజంగా శాపం.

ఇండియాకే గాక యావత్ ప్రపంచంలో ఐటికి ఊహించని అసలైన దెబ్బ 'సత్యం', కుంభకోణం! మూలుగుతున్న నక్కమీద తాటికాయ పడ్డమంటే ఇదేనేమో! అసలే ఆర్థిక మాంద్యంతో సతమతమౌతుంటే, ఈ కుంభ కోణంతో కోలుకోలేని దెబ్బ తగిలింది. 'సత్యం' ప్రభావం మా కంపెనీ మీదా, నా మీదా ఎలా పడిందంటే?

''మోహన్...!'' అంటూ శిరీష రావడంతో నా ఆలోచనలకి అడ్డు పడింది. పనిలో పనిగా శ్రీరామ్ వస్తున్నట్టు ఆమెతో చెప్పాను.

శ్రీరామ్ రావడంతో ఈ మధ్య ఇంట్లో నెలకొన్న స్తబ్దత కొంత దూరమైన మాట వాస్తవం. రెండ్రోజులు ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపేసిన శ్రీరామ్ వచ్చిన పని మీద కాన్‌సన్‌ట్రేషన్ చేస్తూ–

''అన్నయ్యా...! జూనియర్ పోస్టులు ఏం చేస్తాం గాని..... చేస్తే సాఫ్ట్ వేర్ ఉద్యోగమే చేయాలి!''

''ఇప్పటి ఐటి కంపెనీల పరిస్థితి బాగా లేదన్న మాట తెలిసే ఈ మాటంటున్నావా..?''

''నిజంగానే, మొత్తం ఐటి రంగమే మూత బడలేదుగా?''

ప్రస్తుత పరిస్థితులపై అసలు అవగాహన లేని శ్రీరామ్‌కి ఎలా వివరించి చెప్పాలో నాకుతోచలేదు. ఉడుకురక్తంతో ఉరకలేసే వయసులో ఉన్న వాడికి ఏం చెప్పినా అర్థం కాదని నాకు తెలుసు.

''వద్దురా! వేరే ఫీల్డులో ప్రయత్నించు... భవిష్యత్తు బాగుంటుంది'' అన్నాను.

''ఏంటి అన్నయ్యా...! ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగివైయుండి నన్ను డిస్కరేజ్ చేస్తున్నావు? రెండు చేతులా గడిస్తానని జెలసీనా?'' ఉక్రోషంతో అన్నాడు శ్రీరామ్.

ఈ ప్రశ్నకి నా మనసు చివుక్కుమంది. మారుమాటాడకుండా లోపలికి వెళ్ళి ఓ కవరు తీసుకొచ్చి దాన్ని శ్రీరామ్ చేతిలో పెట్టాను.

''ఏంటిది...?'' అన్నాడు ఏమీ అర్థం కాని శ్రీరామ్.

''చూడు నీకే తెలుస్తుంది'' అన్నాను మారుమాటాడకుండా...

కవరులో వున్న ఉత్తరం చదివిన శ్రీరామ్ నావైపు మతిపోయినట్టు చూసాడు.

''అన్నయ్యా!... ఇది నిన్ను ఉద్యోగం నుండి తొలగిస్తూ మీ కంపెనీ ఆర్డరు....!'' వణుకుతున్న గొంతుతో అన్నాడు శ్రీరామ్.

''అవున్రా...! సత్యం ఎపిసోడ్ తరువాత ఐటి రంగంలో జరిగిన పరిణామాలకి నా ఉద్యోగం కొట్టుకుపోయింది. ఇంకా నాలా ఎంతమంది బలయ్యారో లెక్కలకందని వాస్తవం. ఇ ్పుడు చెప్పు... నీకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం దొరికితే నా  జెలసీనా? లేక అనుభవంతో నేను నిన్ను హెచ్చరించానో... నువ్వే నిర్ణయించుకో! ఒక్క ఐటి రంగమే కాక ఇతర రంగాలపైన ఆర్థిక మాంద్యం కాటేసిన ఈ సమయంలో మనకే ఉద్యోగం కావాలో మనం నిర్ణయించుకొనే స్థితిలో లేం. వచ్చిన అవకాశాన్ని అంది పుచ్చుకో్వడమే ప్రస్తుత తరుణంలో వున్న ఒకే ఒక మార్గం!'' గొంతు జీరపోగా కష్టం మీద అన్నాను.

✻